# కొద్ది కథలు

## మా తమ్ముడి తెలివి

మాయింట్లో యేపని చేయవలసి వచ్చినా నేనే చేసిపెట్టాలి. లేకపోతే పద్దుపడతాయి. ఒక్క మా యింటి పనులే కాదు యిరుగు పొరుగులవాళ్లకి కూడా బజారుపనులలో నేను సహాయపడాలి. లేకపోతే మానాన్నగారు కోప్పడతారు. వుపకారమే కదుట్రా, ఆ మాత్రం సహాయంచేస్తే అరిగిపోతావా అంటారు, అందుకే నా చదువు కుంటుపడింది. అలాగంటే మా వాళ్ళు నమ్మరు. నీవు చదవకే నీపరీక్ష పోయిందంటారు.

అయితే మా నాన్నగారికి నామీద ప్రేమ లేకపోలేదు. అదంతా వూళ్ళో వాళ్ళ మెప్పుదలకి. మా నాన్నకి మా తమ్ముడంటే యెక్కువ ప్రేమ, అభిమానం. వాడంటే భయం కూడాను. ఒకనాడు యేం జరిగిందో తెలుసా!

ఆరోజు నేను గ్రెయిన్‌షాపుకి బియ్యంకోసం వెళ్ళేను. అప్పుడు నేను యింటిదగ్గర లేకపోయాను. మానాన్న జరూరుగా ఓ వుత్తరం వ్రాసి రిజిష్టరీ చేసి రసీదు తీసుకురారా అని మా తమ్ముడి చేతికిచ్చి పంపేరు. అదద్దమ్మ తిన్నగా పోష్టాఫీసుకువెళ్ళి రైటరుచేతికి ఆ వుత్తరం యిచ్చేడు రిజిష్టరు చేయాలని. రైటరు ఆ వుత్తరం చూసి నాలుగణాల స్టాంపులు, తిరిగి కవరు యిచ్చి మా తమ్ముడిదగ్గర సొమ్ము తీసుకున్నాడుట. మావాడు అవి పట్టుకొని తిన్నగా మానాన్నగారి దగ్గరకు వచ్చేసాడు. మావాన్నవాడినిచూసి 'ఓరీ వెధవా! యింత జనరల్ నాలెడ్జి లేకపోతే ఎలాగ పనికివస్తావురా? అస్టాంపులు దానిమీద అంటించి యిస్తే రిజిష్టరుచేసినట్టు నీకు రసీదు యిస్తాడు. అది తీసుకురా' అని తిరిగి పంపేరు. యేం చేస్తాడు! మళ్ళా పోస్టాఫీసుకు పోయేడు. ఆ గుమాస్తా వీడిని చూసి యేం అబ్బాయి! బిళ్లలు అంటించమని యిస్తే యింతవరకు యెక్కడకు పోయేవు? యింత తెలివితక్కువ దద్దమ్మవి యే క్లాసు చదువుతున్నావని అడిగితే, స్కూల్ ఫైనల్ చదువుతున్నానండీ అని. చెప్పుకోడానికేనా సిగ్గులేక పోయిందని నలుగురూ నవ్వేరంటే మీరుమాత్రం నవ్వరు. యింతకీ ఆ సమయంలో నేను యింటిదగ్గర లేక పోవడంచేత కథ యింతవరకూ వచ్చింది.

ఎన్. కామేశ్వరరావు.

* * *

## కేస్

గోవిందు పట్టి సోమరిపోతు. ఆపిల్లవాని తండ్రి మంచి ధనవంతుడు. పిల్లవానికేదో నాలుగు ముక్కలు వచ్చేటట్టు చేయాలని తండ్రి ఆశ. అయితే లక్ష్మియున్నచోట సరస్వతియుండదు. సరస్వతి యున్నచోట లక్ష్మియుండదు అనునది సార్థకమయింది గోవిందు విషయములో. పాఠశాలలో ఎప్పుడూ నిద్రపోయేవాడు గోవిందు. ఉపాధ్యాయుడు చెప్పు పాఠములను వినేవాడు కాదు. ఓనాడు D. E. O. వచ్చాడు యిన్స్పెక్షనుకు. ఇంగ్లీషు గ్రామరు యందు ప్రశ్నలు వేయమని D.E.O. చెప్పాడు ఉపాధ్యాయునికి. ఉపాధ్యాయుడు అందరి పిల్లవాండ్లను అడిగాడు. గోవిందును మాత్రము అడుగలేదు. ఎందుకనిన వాడు చెప్పలేడని తెలుసు ఉపాధ్యాయునికి. D. E. O. దీనిని గమనించి గోవిందుని లేపి "కేసు లెన్ని" (How many Cases are there) అని ప్రశ్న అడిగాడు. గోవిందు ఉన్నట్టుండి మూడు సార్! అని అన్నాడు. What are they ? అని అడిగాడు D. E. O; నామినేటివ్ కేస్, ఆబ్జెక్టివ్‌కేస్, మరియు సూట్‌కేస్ (Suit case) అని చెప్పాడు గోవిందు. కడపటిమాటతో D. E. O. కు పట్టలేని నవ్వొచ్చింది. ఉపాధ్యాయుడును, D. E. O. యున్ను కడుపుబ్బేటట్టు నవ్వారు. వారి నవ్వు ఇంతవరకు ఆగలేదంటే నమ్మండి

కె. సుబ్బారాయుడు.

* * *

## ఇష్టంలేని ఆహ్వానం

ఆవాళ ఆఫీసుపనిమీద విశాఖపట్టణం వెళ్లా. కాళ్లరిగేలా తిరగ్గా పని మూడురోజులకు పూర్తయింది. మొదటి రెండురోజులు కలిగిన బడలికచేత, క్రొత్తగా పూర్నాలో లైలామజ్నూ ఆడు

తూండడంచేత రాత్రి లైలామజ్నుచూసి మర్నాడు మావూరికి పోదామని నిశ్చయించా. పట్టుకొనివెళ్లవలసిన సామాన్లు కొనడానికి బజారుకు వెళ్ళాను. సామాన్లన్నీకొని హొటలువేపు నడిచా. ఇంతలో నాకోబంధువు తారసిల్లాడు. అతను మాతోడల్లుని బావమరిదితండ్రి అంటే మా తోడల్లుని చెల్లెలికి మామగారు! ఆయన్ని నేను రెండేళ్లక్రిందట మా తోటల్లునితోరాగా చూశాను. ఆ పరిచయాన్ని పురస్కరించుకొని నేనే మొదట పలకరించా. మొదటి రెండు పిలుపులకు పలుకలేదు. కాని మూడో పిలుపుకి తిరిగిచూసి "ఎవరు నాయనా నువ్వు?" అనిఅడిగాడు. నేను ఫలానా అన్నాను. "అయ్యో! నువ్వేనా నాయనా! ఎప్పుడొచ్చావు? పోని వచ్చినవాడివి మాయింటికోసారి వచ్చావూ?" అని అన్నాడు. "లేదండి మొన్ననే వచ్చాను! పనులు చాలా వుండడంచేత రాలేకపోయాను! పోనీ ఈసారి వచ్చినప్పుడు వస్తానులెండి!" అన్నా గౌరవంగా! "ఇంకా మరెప్పుడొస్తావు? ఇవాళ మాయింట్లో భోజనం చేసేదాకా వదలను" అని బలవంతాన తీసికొనిపోయాడు. హొటలు ఖర్చు తగ్గుతుందని లోలోన సంతోషించినా పైకి మాత్రం గౌరవానికి లోపంరాకుండేలాగ "క్షమించండి! మామగారు! ఇప్పుడనేకమైన పనులున్నాయి! ఈసారి వచ్చినప్పుడు వస్తాను! ఇప్పుడుమాత్రం వదలండి!" అని అంటున్నా. అయినా ఆయన వదలకుండా తీసికొని పోతున్నాడు! మైలు దూరం నడిచేసరికి ఆయనయిల్లు చేరుకున్నాం. ఇల్లును సమీపించగానే ఆయన నన్ను వీధిగుమ్మంవద్ద ఆపి తన రెండుచేతులతో నా రెండు భుజాలను పట్టుకొని ఎదురుగా నిల్చొని 'ఇదిగో అబ్బాయీ! నీ కిప్పుడు చాలా పనులున్నాయంటున్నావు. ఈ సారి వచ్చేటప్పుడు వస్తానంటున్నావు కనుక నిన్నిప్పుడు వదిలేస్తున్నాను. ఈ సారి వచ్చేటప్పుడు తప్పకుండా మా ఇంటికి రావాలి!" అని చెప్పి మరక్కడ ఆగకుండా యింట్లోకిపోయి తలుపు బిడాయించాడు. నేను విస్తుపోయి నిల్చున్నాను! అప్పుడు చేసేదేవిటి? చచ్చినట్టు మైలున్నరదూరం నడిచి వెళ్లి ఒంటిగంటకు గిన్నె అడుగున మిగిలిన పాడిమెతుకులు హొటల్లోతిని క్షుద్బాధ తీర్చుకున్నాను. అప్పటినుంచీ బంధువుల ఇళ్లకు వెళదామన్నా, కనబడిన బంధువుల్ని పలకరిద్దామన్నా భయం పట్టుకుంది.

పంతుల కృష్ణారావు.

* * *

# దూడగడ్డికోసం

నాకు పదేళ్ల వయసులో మా తాతగారి గ్రామం జగన్నాథపురం వెళ్ళి నాలుగేండ్లు వుండవలసి వచ్చింది. అక్కడ బడిలో 5 వ తరగతి చదువుతున్నాము. ఆవూళ్లో కొబ్బరితోటలు విపరీతంగా పెంచబడివున్నాయి. నేను నా క్లాసు విద్యార్థులు ఎక్కడికి వెళ్లినా ఏ పనిచేసినా, మా అందరం జట్టుగా చేసేవాళ్లం, కామశాస్త్రి దొడ్లో చాలా కొబ్బరిచెట్లున్నాయి. విపరీతంగా కాచాయి. మాకు వాటిలో సగం కాజేయాలని బుద్ధిపాడమింది. చీకటి రాత్రులు రాగానే, అర్ధరాత్రిసమయములో వెళ్ళి కోసుకురావడం మరునాడు షావుకారుకు విక్రయించడం జరిగించుతున్నాం. ఈసంగతి ఆనోటా యానోటా వెళ్లి ఆశాస్త్రి చెవుల్లో మారుమ్రోగింది. ఇది ఏగుంట వెధవల పనో అని రాత్రులందు కాపుకాయుట ప్రారంభించాడు. అతను కాచినంతసేపు మేము పొంచివుండి తర్వాత మా పని మేము యథాప్రకారం చేసేవాళ్లం. అతను కాపుకాస్తున్నా కాయలుమాత్రం ఉండడంలేదు. అందులో ఓరోజున చాలారాత్రివరకు కాపువుండి లోనికి పోయినాడు. మేము మామూలుగా చెట్లు పనిపుచ్చుకున్నాము. దబ, దబమని కాయలుపడుతున్నాయి. ఇంతలో ఎవర్రా మీరు లంజకొడకల్లారా! మీకిదేం పోయేకాలంరా! రండర్రారండి దొంగలు, దొంగలో, అని బిగ్గరగా శాస్త్రి ఉరిమాడు. ఆగోల విని అందరూ వస్తున్నారనగా మేము చల్లగా చెట్లుమీదనుండి క్రిందకి ఉరికాము. మాలో చవటదద్దమ్మ చెట్టుమీదనుండి దిగలేకపోయినాడు. ఎంతోసేపు పట్టలేదు. చాలామంది మూగారు. ఎవడవురానీవు! కొబ్బరిచెట్టు ఎందు కెక్కావు? డొక్క చీలుస్తా బుర్ర పగలగొట్టా దిగు అనగా మాతాత నేను గడ్డి తేలేదని తంతే దూడగడ్డికోసం ఎక్కాను మరేం లేదు. ఈతప్ప కాయండి, యీతప్ప అంటున్నాడు. మా పరువు పోగొట్టినాడని ఛీ వెధవా దిగిరా నీ పనిపట్టాం అని అందరికిమల్లె మేమూఅన్నాము. వాడూ దిగగానే బెత్తంపుచ్చుకొని చేతికొచ్చిన దెబ్బ కాలుకొచ్చిన తన్ను తన్నారు. దాంతో వాడి ముఖం నెంబరు సెవెన్‌లా మారింది. బాబోయ్ యీతప్పు కాయండి చెంపలేసుకుంటాను అని ఆ అర్ధరాత్రిసమయములో ఒకటే రోదన. బాగా అయిందంటే మాబాగా అయిందని అందరూ దారితీశారు. మావాడ్ని కలిసి ఏం రోయ్ బ్లాకుమార్కు సంపాదించావేమిట్రా అనే సరికి వూరుకోండ్రా. దూడగడ్డికి రా, దూడగడ్డికి అన్నాడు. నవ్వుకుంటూ అందరం యిండ్లకుచేరి ఆరోజునుండి ఆ పనికి ఓ సలాం పారేశాం.

కుమారి ఇందిరా